# గోదావరి మీద కరకట్ట కట్టిస్తాం..

- వచ్చే ఎండాకాలంలోనే మొదలుపెట్టి పూర్తి చేసుకుందాం..
- పొరపాటున కాంగ్రెస్‌కు ఓటేస్తే వాడ కట్టుకో పేకాట క్లబ్ వస్తది
- మంచిర్యాల నియోజకవర్గ 'ప్రజా ఆశీర్వాద సభ'లో సీఎం కేసీఆర్

మంచిర్యాల, నవంబర్ 24(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మంచిర్యాలలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి దివాకర్‌రావును గెలిపిస్తే.. గోదావరి మీద కరకట్ట కట్టిస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ మాట ఇచ్చారు. మంచిర్యాలలో గోదావరి పక్కనున్న ప్రాంతాల్లోకి నీళ్లు వస్తున్నయని, ఆ ఏరియాలకు నీళ్లు రావొద్దంటే గోదావరి మీద ఒక కరకట్ట అడ్డుగోడ కట్టి, నీళ్లను ఆపాలన్నారు. మీరు దివాకర్‌రావును గెలిపించండి 100 శాతం ఆ పని నేను చేయిస్తానని స్పష్టం చేశారు. మంచిర్యాలలో శుక్రవారం నిర్వహించిన నియోజకవర్గ 'ప్రజా ఆశీర్వాద సభ'లో ముఖ్యమంత్రి కేసీఆర్ మాట్లాడారు. పెద్ద పట్టణమైన మంచిర్యాలను కాపాడుకుంటామన్నారు. గోదావరి మీద కరకట్ట నిర్మించి చుక్క నీరు కూడా పట్టణంలోకి రాకుండా చూసే బాధ్యత నాదన్నారు. ఆ పని కూడా వెంటనే లేట్ చేయకుండా చేస్తామని, అవసరమైతే వచ్చే ఎండాకాలంలోనే ధనాధన్ మొదలు పెట్టి శరవేగంగా పూర్తి చేస్తామన్నారు. దివాకర్‌రావును గెలిపించుకుంటే మీకు చాలా మేలు జరుగుతుందన్నారు. దివాకర్‌రావు సౌమ్యుడు, మర్యాద పూర్వకంగా ఉండే మనిషి. ఇగ, మీ దగ్గర ఉన్న కాంగ్రెసాయనకు పొరపాటున ఓటు వేశారనుకో.. వాడ కట్టుకో పేకాట క్లబ్ వస్తదన్నారు. మంచిర్యాల నిండా పేకాట క్లబ్‌లు అయితాయని, క్లబ్‌లకు మాత్రం కొదవ ఉండదన్నారు. ఇండ్లు అమ్ముకోవాలే.. పేకాటలో పెట్టాలే.. గంతకు మించి ఏం ఉండదన్నారు. ఇది చాలా ప్రమాదకరమని, దెబ్బతింటారని.. చాలా ఖతర్నాక్ పని అయితది హెచ్చరించారు. అందుకే జా గ్రత్త ఇవన్నీ మీరు చర్చ చేయాలని, ఎవరు గెలిస్తే మంచిదని నిర్ణయం తీసుకోవాలని కోరారు.

## కాంగ్రెసోళ్లది ఝూటా ముచ్చట..

ఇప్పుడు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కొత్త స్టైల్ మొదలు పెట్టారని సీఎం కేసీఆర్ అన్నారు. ఎట్లాగు గెలుస్తలేం ఓడిపోతున్నమని.. కొత్త పద్ధతిలో నన్ను గెలిపియండి బై.. నేను కూడా బీఆర్‌ఎస్‌లనే జాయిన్ అయితా అని చెప్పుకుంటున్నట్లు తెలిసిందన్నారు. ఇక్కడున్నాయన కూడా అట్లనే చెప్తున్నట్లు నాకు వార్త వచ్చిందన్నారు. అలాంటిది ఏం లేదని, అందంతా అబద్ధమని, ఝూటా ముచ్చట అని స్పష్టం చేశారు. ఏదన్న లంగతనం చేసి గెలవాలనే బద్మాష్ గిరి తప్ప అది వాస్తవం కాదన్నారు. మేము పదేండ్లు కష్టపడి అన్ని రంగాల్లో ఎప్పుడు అనుకోని పనులు చేశామన్నారు. రైతాంగానికి, పేద ప్రజలకు అన్ని రకాలా అభివృద్ధి చేసుకున్నామన్నారు. ఇవన్నీ కూడా మీ ముందు ఉన్నాయని, మరి వాళ్లు వచ్చి మేం 3 గంటలే కరెంట్ ఇస్తాం. ధరణి తీసేస్తాం. రైతుబంధు దండుగా అని మాట్లాడుతున్నరని మండిపడ్డారు. వాళ్లకు ఓటేస్తే ''ఎల్లమ్మ కూడ బెడితే.. మల్లమ్మ మాయం చేసింది' అన్నట్లు ఈ పదేండ్ల కష్టం బూడిదలో పోసిన పన్నీరు అవుతదని తెలిపారు. దివాకర్‌రావు లాంటి మంచి మనిషి గెలిస్తే తప్పకుండా మీకు లాభం జరుగుతుందన్నారు. ఆయన తన దగ్గరికి ఎప్పుడు వచ్చిన వ్యక్తిగతమైన పైరవీలు అడగలేదని, నాకు అంతర్గాం బ్రిడ్జి కావాలే.. నాకు గూడెం లిఫ్ట్ పక్కన ఇంకొక లిఫ్ట్ కావాలే.. పొలాలకు నీళ్లు కావాలే ఇవే మాట్లాడారు తప్ప ఎన్నడూ ఆయన పర్సనల్ పని అడగలేదన్నారు. దయచేసి ఒక మంచి వ్యక్తి గెలిస్తే, మంచి వ్యక్తి ఆధ్వర్యంలో మంచిర్యాల ఉంటే మీకు అన్ని రకాల లాభం జరుగుతదన్నారు. మంచి ఎమ్మెల్యే గెలిస్తే మంచి గవర్నమెంట్ వస్తదని, చెడ్డ ఎమ్మెల్యే గెలిస్తే చెడ్డ గవర్నమెంట్ వస్తదన్నారు. మీరు తప్పకుండా ఇక్కడున్న అభ్యర్థుల గురించి ఆలోచించాలన్నారు. ఎవరు ఎలాంటోళ్లు అవకాశం ఇస్తే ఏం చేస్తరు.. నీతినిజాయితీగా ఎవరుంటరు.. గోల్‌మాల్ చేసేటోళ్లు ఎవరు.. ఇదంతా కూడా మీరు ఆలోచించాలని కోరారు. అంతకన్న ముఖ్యంగా అభ్యర్థుల వెనకాల ఉన్న పార్టీలను, ఆ పార్టీల చరిత్ర, నడవడికను పరిగణిలోకి తీసుకోవాలన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ పుట్టిందే తెలంగాణ కోసం, తెలంగాణ ప్రజల కోసమన్నారు.

## తలాపున గోదావరి ఉన్నా.. గోస పడ్డాం..

రామగుండం పక్కన ముర్మూరులో ఉండే ఒక కవి తలాపునే పారుతుంది గోదారీ.. మన చేను, మన చెలక ఎడారీ.. అని పాట రాశారని సీఎం కేసీఆర్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. గోదావరి పక్కనే ఉంటాం కానీ చారడు నీళ్లు మన గడ్డ మీదకు రావన్నారు. కనీసం మంచినీళ్లు కూడా ఇయ్యలేకపోయారని, గోదావరి ఒరుసుకొని పారుతున్న ప్రాంతంలో కూడా సరైన మంచి నీరు అందించ లేక పోయారన్నారు. నీళ్ల కోసం గోస పడ్డాం అన్నారు. చేనేత కార్మికుల ఆకలి చావులు, రైతుల ఆత్మహత్యలు, ఇక్కడ ఏం లేవని వలస పోవుడు చాలా భయంకరమైన బాధ కలిగిందన్నారు. వ్యవసాయంలో ఎన్ని ఇబ్బందులు పడ్డామో.. పొద్దాక జెరంత కరెంట్.. తెల్లందాక జెరంత కరెంట్. ఆడికి పోతే షాక్‌లు కొట్టి సచ్చిపోవుడు.. పాములు కరుసుడు చాలా బాధలు పడ్డామని గుర్తు చేశారు. ఆ బాధలన్నీ పోవాలని నిర్ణయం తీసుకొని నీటి తీరువాను రద్దు చేసుకున్నామన్నారు. మంచిర్యాలకు గూడెం లిఫ్ట్ ద్వారా నీళ్లు వస్తే, దానికి నీటి తీరువా లేదన్నారు. కడెం ప్రాజెక్టు నుంచి, గూడెం నుంచి వచ్చే నీటికి రూపాయి కూడా నీటి తిరువా లేదన్నారు. రైతులకు కరెంట్ చార్జీలు లేవని, 24 గంటల ఫ్రీ కరెంట్ ఇస్తున్నామని చెప్పారు. దివాకర్‌రావును గెలిపిస్తే ఇవాళ ఎకరాకు రూ.10 వేలు ఇస్తున్న రైతుబంధు రేపు ఎకరానికి రూ.16 వేలు ఇస్తామన్నారు. 24 గంటల కరెంట్ ఇట్లనే ఉండాలంటే దివాకర్‌రావును గెలిస్తేనే ఉంటుందన్నారు. ఎందుకంటే యుద్ధానికి వెళ్తున్నప్పుడు కత్తి ఒకని చేతుల పెట్టి.. యుద్ధం ఇంకొకడిని చేయమంటే నడుస్తదా.. అని ప్రశ్నించారు. ఎవడైతే మన కోసం యుద్ధం చేస్తడో వాని చేతికి కత్తి ఇచ్చి యుద్ధం చేయమనాలే.. కత్తి ఒకనికి ఇచ్చి యుద్ధం ఇంకొకడిని చేయమంటే కాదు కదా.. అది ధర్మమైతదా.. ఆలోచించాలన్నారు. బీఆర్‌ఎస్ గెలిస్తేనే కదా అన్ని వచ్చేదన్నారు. అందుకని ఆగం కాకండి. ఆలోచించి ఓటు వేయండని చెప్పారు.

## బీఆర్‌ఎస్ వచ్చాకే డిపెండెంట్ ఉద్యోగాలు పునరుద్ధరించాం..

నిజాం కాలంలో 130 ఏండ్ల కింద ప్రారంభమైన కంపెనీ సింగరేణి అని సీఎం కేసీఆర్ అన్నారు. 100 శాతం అది మన రాష్ట్ర కంపెనీ అని మీ అందరికీ తెలుసునన్నారు. ఈ కాంగ్రెస్ దద్దమ్మలు రాజ్యం ఏలినప్పుడు.. వాళ్లకు చేతగాక కేంద్ర ప్రభుత్వం దగ్గర అప్పులు తెచ్చి, 49 శాతం వాటా కేంద్రానికి ఇచ్చారన్నారు. అప్పు తిరిగి కట్టడం చేతగాకనే వాళ్లకు 49 శాతం వాటా పోయిందన్నారు. ఇంక వాని పుణ్యాం 51 శాతమన్న ఉంచారని, ఆయింత అది కూడా పోతే ఒడిసే పోతుండే అంటూ మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన యూనియనోళ్లు, సీపీఐ పార్టీలకు సంబంధించిన యూనియనోళ్లు మొత్తం అన్ని యూనియనోళ్లు కూడబల్కొని డిపెండెంట్ ఉద్యోగాలకు మంగళం పాడారన్నారు. మీ అందరికీ తెలుసు సింగరేణి డిపెండెంట్ ఉద్యోగాలు ఊడగొట్టింది ఈ పార్టీల యూనియనోళ్లే.. అది తక్కువ, ఇది తక్కువ అని తిరుగుతున్న ఈ యూనియన్లే. ఆ రోజు ఉద్యోగాలు ఊడగొట్టినయ్ కదా అని మండిపడ్డారు. మళ్ల బీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చాక డిపెండెంట్ ఉద్యోగాలు పునరుద్ధరించుకున్నామన్నారు. 15 వేల మందికి ఉద్యోగాలు ఇచ్చుకున్నామని, ఎవలన్న ఉద్యోగం తీసుకోకపోతే వాళ్లకు రూ.25 లక్షలు ఇస్తున్నామన్నారు. సింగరేణి కార్మికులు ఇల్లు కట్టుకుంటే రూ.10 లక్షలు ఇచ్చి, వడ్డీలేని రుణం ఇస్తున్నామన్నారు. సింగరేణి కార్మికులు దినదిన గండం నూరేళ్ల ఆయుష్షు అన్నట్లు ఉంటరని, వాళ్లకు ఇన్‌కం ట్యాక్స్ మాఫీ చేయమని నరేంద్ర మోదీకి అసెంబ్లీలో తీర్మానం చేసి ఎప్పుడో పంపించిన, ఆ మోదీ చేస్తలేడన్నారు. ఇవాళ బీజేపీ పార్టీ నుంచి ఇక్కడ ఒకరు నిలబడ్డారని, దేశంలో 157 మెడికల్ కాలేజీలు పెడితే, నీను ఒక 100 ఉత్తరాలు రాసిన మోదీ ఒక్క మెడికల్ కాలేజీ తెలంగాణకు ఇయ్యలేదన్నారు. చట్టం ప్రకారం జిల్లాకు నవోదయ పాఠశాలలు ఇవ్వాలని ఉన్నా.. దాన్ని ఉల్లంఘించి మన రాష్ట్రానికి ఒక్క పాఠశాల కూడా ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మన రాష్ట్రానికి ఒక్క మెడికల్ కాలేజీ, ఒక్క నవోదయ పాఠశాల ఇవ్వని బీజేపీకి మనం ఎందుకు ఓటు వేయాలి.. వాళ్లు ఏ ముఖం పెట్టుకొని మనల్ని ఓటు అడుగుతున్నరో ఆలోచించాలన్నారు. బీజేపీకి వేస్తే ఆ ఓటు మోరిలో పారేసినట్లేనని, ఆ ఓట్లు ఏవో దివాకర్‌రావుకు వేస్తే మీకు మంచి పనులు జరుగుతాయన్నారు. సింగరేణి కార్మికులకు లాభాల వాటా, దసరా, దీపావళి బోనస్ రూ.1000 కోట్లు పంచినమన్నారు. ప్రతి కార్మికుడికి దగ్గర దగ్గర రూ.1.80 లక్షల నుంచి రూ.2 లక్షలు వచ్చినయన్నారు. గతంలో ఓన్లీ 16 శాతం వాటా ఇస్తే లాభాల్లో.. ఇవాళ మనం 32 శాతం ఇచ్చుకుంటున్నామన్నారు. కార్మికుల హక్కులు కాపాడుతున్నది ఒక్క బీఆర్‌ఎస్ మాత్రమేనని, ఇవన్ని కూడా మీరు దృష్టిలో ఉన్నాయని చెప్పారు. దివాకర్‌రావు గెలుపు కోసం కృషి చేస్తున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి దివాకర్‌రావు, ఎంపీ వెంకటేశ్ నేతకాని, ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ భాను ప్రసాద్, మాజీ ఎమ్మెల్యే అరవిందరెడ్డి, టీబీజీకేఎస్ అధ్యక్షుడు వెంకట్రావు, డీసీఎంఎస్ చైర్మన్ లింగన్న, మాజీ మంత్రి బోడ జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.

# మీరేం చేశారు..
## ఉన్నదంతా దోచుకు తిన్నారు..

- సిట్టింగ్ ఎమ్మెల్యే రేఖానాయక్‌ను నిలదీస్తున్న జనం
- సీఎంపై చేసిన ఆరోపణలు ఉపసంహరించుకోవాలని డిమాండ్
- తన సొంత డిగ్రీ కాలేజీని కాపాడుకునేందుకు ప్రభుత్వ కాలేజీ ఏర్పాటుకు మోకాలడ్డు
- సొంత గోదాములు, రైస్ మిల్లులపై నోరెందుకు మెదపరు
- తప్పుడు కులం సర్టిఫికెట్‌తో ఎమ్మెల్యే పదవి పొందిన వారెవరు?
- బీజేపీ అభ్యర్థి రమేశ్ రాథోడ్‌ను నిలదీస్తున్న ప్రజలు
- ఇలాంటి వారికి కేసీఆర్‌ను విమర్శించే నైతిక హక్కు లేదంటున్న జనం

నిర్మల్, నవంబర్ 24(నమస్తే తెలంగాణ) : రాజకీయంగా పదవులు అనుభవించి, కోట్ల రూపాయలు సంపాదించిన వారే తమకు నీడనిచ్చి ఆదుకున్న పార్టీనే విమర్శిస్తుండడంపై జనం దుమ్మెత్తి పోస్తున్నారు. రాజకీయ ఓనమాలు నేర్చుకొని పదవులు, డబ్బులతో అందలమెక్కిన వారంతా తమ గతాన్ని మర్చిపోయి, తల్లి లాంటి పార్టీనే విమర్శిస్తుండాన్ని విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఖానాపూర్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేగా గెలుపొందిన రేఖానాయక్ తనకు టికెట్ రాకపోవడంతో పార్టీని వీడడమే కాకుండా, సీఎం కేసీఆర్‌ను విమర్శిస్తుండడంపై జనం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేవలం తన స్వార్థం కోసం ఖానాపూర్ నియోజకవర్గ అభివృద్ధిని పక్కన పెట్టి తన వ్యాపారాలను విస్తరించుకున్న రేఖానాయక్.. టికెట్ దక్కకపోవడంతో అండగా నిలిచిన పార్టీనే విమర్శించడం విడ్డూరమని మండిపడుతున్నారు. సీఎం కేసీఆర్ ఖానాపూర్ నియోజకవర్గ కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేస్తానని గత ఎన్నికల ప్రచారంలో ఖానాపూర్‌కు వచ్చినప్పుడు హామీ ఇవ్వడమే కాకుండా, దానికి సంబంధించిన కార్యాచరణను మొదలు పెట్టించారు. అయితే రేఖానాయక్ అప్పటికే ఖానాపూర్ నియోజకవర్గ కేంద్రంలో ప్రైవేటు డిగ్రీ కాలేజీని ఏర్పాటు చేశారు. తన సొంత కాలేజీ అప్పటికే లాభాల వర్షం కురిపిస్తుండడంతో ఇక్కడ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఏర్పాటైతే తన లాభాలు పడిపోతాయన్న ఉద్దేశంతో సీఎం కేసీఆర్ చొరవ చూపినా ఆ దిశగా పట్టించుకోకుండా ప్రభుత్వ కాలేజీ ఏర్పాటును అడ్డుకున్న విషయం బహిరంగ రహస్యమే.

## సదర్మాట్ బ్యారేజీని పొన్కల్‌కు తరలించిందెవరు?

ఖానాపూర్ నియోజకవర్గానికి సాగు నీరందించేందుకు నిర్మించ తలపెట్టిన సదర్మాట్ బ్యారేజీని పొన్కల్‌కు తరలించడం వెనుక రేఖానాయక్ వైఫల్యం ఉందన్న విమర్శలున్నాయి. తన కండ్ల ముందే సాకారమయ్యే ఓ ప్రాజెక్టు పొరుగు ప్రాంతానికి తరలిపోతున్నా పట్టించుకోకుండా ఉన్నదెవరో అందరికీ తెలుసు. అలాగే తనకు సొంత రైస్‌మిల్లులు, గోదాములు ఉన్న కారణంగా సర్కారు గోదాముల నిర్మాణానికి అడ్డు తగులుతూ తన సొంత గోదాములు అద్దెకిచ్చుకొని కోట్లాది రూపాయలను ఆర్జించారంటున్నారు. అలాగే గతంలో ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీలకు సబ్సిడీపై ట్రాక్టర్లను పెద్ద ఎత్తున అందజేసేందుకు నిర్ణయించగా, రేఖానాయక్ రంగంలోకి దిగి ఓ ప్రైవేటు ట్రాక్టర్ కంపెనీ డీలర్ షిప్ పొందిన సంగతి వాస్తవం కాదా అని ప్రశ్నిస్తున్నారు. కేవలం తన బినామీలకు చెందిన డీలర్ల వద్ద నుండే ట్రాక్టర్లను కొనుగోలు చేయాలంటూ ఆయా ప్రభుత్వ కార్పొరేషన్‌లకు ఆమె హుకుం జారీ చేయలేదా.. అని నిలదీస్తున్నారు. దీంతోపాటు ఖానాపూర్ పట్టణంలో రోడ్డు విస్తరణ, డివైడర్ల నిర్మాణం, సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు పనులకు రాష్ట్ర ప్రభుత్వం నాలుగేళ్ల క్రితమే నిధులు మంజూరు చేసింది. ఎమ్మెల్యే రేఖానాయక్ సదరు కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తెచ్చి కమీషన్లు ఇవ్వాలని మొండి పట్టు పట్టడంతో కాంట్రాక్టర్ పనులు చేయలేక చేతులెత్తేశాడన్న ఆరోపణలున్నాయి.

## బీజేపీ గత చరిత్రను విస్మరించి రాజకీయ లబ్ధి కోసం పాట్లు

బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే రమేశ్ రాథోడ్ తన గత చరిత్రను విస్మరిస్తూ రాజకీయ లబ్ధి కోసం కేవలం ఓట్లను పొందేందుకు సీఎం కేసీఆర్‌పై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారంటూ ప్రజలు తిరగబడుతున్నారు. ఇప్పటికే ఆయన ప్రసంగించిన ప్రతి చోటా జనం వాస్తవాలపై ఆయనను నిలదీస్తూ ఎదురుదాడి చేస్తున్న అంశం నియోజకవర్గంలో రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకుంటున్నది. అంతే కాకుండా ఆయన కుటుంబ సభ్యులపై తప్పుడు కులం సర్టిఫికెట్‌తో పదవులు పొందినట్లు ఆరోపణలున్నాయి. ఇదిలా ఉండగా ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం కేసీఆర్ ఈ నెల 26న ఖానాపూర్‌కు రానున్న నేపథ్యంలో కాంగ్రెస్, బీజేపీలు కొత్త కుట్రలకు తెర లేపుతున్నాయంటున్నారు. ఇందులో భాగంగానే ఎమ్మెల్యే రేఖానాయక్ చేపట్టని అభివృద్ధి పనులను బీఆర్‌ఎస్ సర్కారుపై నెట్టివేస్తూ దానికి సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేసేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రయత్నాలు మొదలు పెట్టినట్లు తెలుస్తోంది. సీఎం సభ రోజే ఈ కరపత్రాలను పంపిణీ చేసేందుకు కుట్ర జరుగుతున్నట్లు చెబుతున్నారు. దీనికి తోడు బీజేపీ కూడా తప్పుడు ఆరోపణలు, ఫిర్యాదుల పేరిట ఇలా కరపత్రాలను పంపిణీ చేసి అధికార బీఆర్‌ఎస్ పార్టీపై దుష్ప్రచారం చేసేందుకు సిద్ధమవుతున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీనిని తిప్పికొట్టేందుకు ఓ వైపు బీఆర్‌ఎస్ శ్రేణులతో పాటు, మరోవైపు ఖానాపూర్ నియోజకవర్గ ప్రజలంతా ఎదురుదాడి కొనసాగించేందుకు సిద్ధమవుతున్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★రామకృష్ణ గ్రూప్ (AP, న్యూఢిల్లీ No.1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషెంట్ల సేవకు ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గంటల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5 వేలు కమీషన్. వృద్ధుల/పేషెంట్ల సేవకు వర్కర్లను 24x7 మీ ఇంటి పంపగలము. 9281452762, 9515108830.
NT-314461

CHANGE OF NAME

I, **RAM MOHAN** (Old Name) S/o. **DIVAKAR** R/o.H.No.4-2-164/7/1, Sri Ranisatiji Colony, Adilabad is hereby by Declare That I shall be called as **"GUNDAWAR RAM MOHAN"** Holding Passport No.T278570 Dt. 12-12-1994, Valid upto 11-12-2004, Issued at Hyderabad hence Declared.

CHANGE OF NAME

★**I, RAMABHARATHI GADDADI,** (Old name) R/o: 10-100003, OMAX Colony, E3, Naspur Gate, Mdl: Naspur, Dist: Mancherial. have Changed my Surname as **GEDDADI RAMABHARATHI W/o GEDDADI RAM BAHU,** (New Name).
NTK-317305

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

